క్లుప్తంగా

ధాన్యం డబ్బులు చెల్లించాలి

చిన్నచింతకుంట: రైతులకు వరి కొనుగోలు డబ్బులను వెంటనే చెల్లించాలని అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రం డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశాడు. వ్యవసాయ కేంద్రం వద్ద డబ్బుల చెల్లింపుపై అధికారులతో శుక్రవారం ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 30 రోజులు గడుస్తున్నా ఇంకా చెల్లించలేదన్నారు. వర్షాకాలం సమీపిస్తుందని రైతులకు సాగు సంబంధం అవసరాలకు డబ్బులు అవసరమవుతాయని వెంటనే చెల్లించాలని అన్నారు.

జిల్లాకు మంచి పేరు తేవాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన నాగేకారి సాయి తేజను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సన్మానించారు. కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తేవాలని, డాక్టర్ కావాలని ఆకాంక్షించారు. విద్యార్థి తండ్రి యాదిలాల్, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ వినియోగించుకోండి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన స్థానిక మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో ఒక రోజు ఉచిత కిక్‌బాక్సింగ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, రవినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో మ్యూజికల్ ఫాం, పాయింట్ ఫైలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆసక్తిగలవారు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మిగతా వివరాల కోసం 9985824099, 9550803134 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కబడ్డీ క్రీడాకారులకు ఆర్థిక సాయం

అడ్డాకుల: సీఎం కప్–2023 జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైన మండలానికి చెందిన కబడ్డీ క్రీడాకారులను శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. ఎంపికైన కిరణ్‌యాదవ్, పాండు నాయక్, కౌశిక్‌లను శాలువాలతో సత్కరించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రతిభ కనబర్చి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కోఆప్షన్ ఖాజాషెరీఫ్, చల్మారెడ్డి, రమేష్, బాలరాజు, వెంకటేష్ యాదవ్, కుమ్మరి శ్రీను తదితరులు ఉన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

నారాయణపేట: సారా తయారు చేసినా, విక్రయించినా కేసులు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేందర్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఊటకుంటతండా, అభంగపూర్‌లో పోలీస్‌బృందంతో కలిసి దాడులు నిర్వహించారు. ఊటకుంటతండాలో 40 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ ఎవరైనా గుట్టలు, పంట పొలాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లయితే మానుకోవాలని హెచ్చరించారు. గంజాయితో ఆరోగ్యం పాడవుతుందని, వాటికి దూరంగా ఉండాలని కోరారు. సారాయి తయారు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

కోటకొండ విషయంలో వివక్ష సరికాదు

నారాయణపేట రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో మండలాలను ప్రకటించిన ప్రభుత్వం అన్ని అర్హతలు ఉన్న కోటకొండపై వివక్ష చూయించడం సరికాదని బీజేపీ పాలమూర్ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దం గోపాల్ విమర్శించారు. మండలంలోని కోటకొండలో శుక్రవారం అభంగాపూర్ గ్రామస్తుల తరఫున 17వ రోజు రిలేదీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌ను మండలాలుగా ప్రకటించి, అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనన్నారు. చుట్టుపక్కల ఎన్నో గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉందని, వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కోటకొండను మండలంగా ప్రకటించేలా ఒత్తిడి తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, కాశీనాథ్, కెంచె శ్రీనివాసులు, నర్సింహులు, రాములు, చెన్నప్ప, ప్రవీణ్, బాలకృష్ణ, బలరాం, హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సింహులు, దస్తప్ప, సాయిలు, ఆంజనేయులు, తిరుపతి, గుండప్ప పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది



ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: రాష్ట్రంలోని ప్రతి పల్లెలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేపల్లిలో బ్రొడాయి, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పల్లెలు అనతి కాలంలోనే అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నాయని వివరించారు. కేసీఆర్ ముందు చూపుతోనే ఇది సాధ్యమవుతోందని అన్నారు. పల్లెల్లో పండుగల వాతావరణం తొణికిసలాడుతోందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, బీఆర్‌ఎస్ యువ నాయకుడు అభిమన్యురెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతుబంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల గుర్తింపు

జడ్చర్ల: 'డబుల్' ఇళ్ల కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి తెలిపారు.అర్హులందరికీ ఇళ్లు పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామమని తెలిపారు. డబుల్ ఇళ్ల కేటాయింపు పై శుక్రవారం స్థానిక నిమ్మబాయిగడ్డ ప్రాంతంలోని 17, 20వ వార్డులలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి విచారించారు. కేటాయింపులో పూర్తి పారదర్శకత కోసం తానే స్వయంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నానని, వచ్చే నెలలో పంపిణీ ఉంటుందని వివరించారు.

నేడు మంత్రి హరీష్‌రావు రాక

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు జడ్చర్ల వంద పడకల ఆస్పత్రి భవనాన్ని శనివారం ప్రారంభిస్తారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. దాదాపు రూ.33 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, కమిషనర్ షేక్ పాల్గొన్నారు.

జన సంపర్క్ అభియాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న పద్మజారెడ్డి

జడ్చర్ల టౌన్: జనసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టౌన్ కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా జూన్ 1 నుంచి 30 వరకు మోదీ విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. పట్టణంలో బూత్‌స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుండగా ప్రపంచ దేశాలు సైతం మెచ్చుకుంటున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, అసెంబ్లి కన్వీనర్ పూలమోని నర్సింహులు, కౌన్సిలర్ కుమ్మరి రాజు, జిల్లా అధికార ప్రతినిధి సామల నర్సింహులు, మహిళామోర్చ ప్రధాన కార్యదర్శి సాహితిరెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారికి అభిషేకం చేసి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం లలితా సహస్రనామార్చనతో పాటు అమ్మవారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు.

సమష్టి కృషితోనే అధికారం



సమావేశంలో పాల్గొన్న వీరబ్రహ్మచారి తదితరులు

బాలానగర్: అందరూ కలిసికట్టుగా కృషిచేస్తేనే పార్టీ అధికారంలోకి వస్తుందని భాజపా జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నూతన అధ్యక్షుడు పానుగంటి శ్రీశైలం అధ్యక్షతన ఏర్పాటైన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకురాలు బాలాత్రిపురా సుందరీ దేవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను సన్మానించారు. వచ్చే నెలలో జరగనున్న మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంపై వివరించిన ఆయన రాష్ట్రంలో రానున్నది భాజాపా ప్రభుత్వమే అని ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే అఖండ మెజారిటీ వస్తుందని అన్నారు. బాలాత్రిపురా సుందరీ దేవి మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఎంతో శ్రమిస్తున్నారని మరికొంత కాలం ఇష్టంగా కష్టపడితే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని అన్నారు. తిరుపతి, సతీష్, కుమార్ చారి, సధాశివరెడ్డి, నరేష్ యాదవ్, భాను, కుమార్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

28న ఆత్మీయ సమ్మేళనం



అడ్డాకుల: కందూర్ స్టేజీ వద్ద ఈనెల 28న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి కోరారు. కందూర్ స్టేజీ సమ్మేళన మైదానాన్ని శుక్రవారం వారు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆదేవిధంగా మండలంలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, రమేష్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులను ఆదుకోండి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెంచి ఆదుకోవాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ తరఫున మెయిల్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతిపత్రం పంపించామన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తోందని, రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే తక్కువ జీతాలతో ఆర్టీసీ కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని, వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని జీతాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రకటన కోసం రాష్ట్రంలోని సుమారు 3 లక్షల ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయన్నారు. రాత్రి, పగలు, ఎండ, వాన తేడా లేకుండా పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని 11కేవీ వీరన్నపేట్ ఫీడర్ మరమ్మతు కారణంగా శనివారం పట్టణంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ 2 ఏఈ ఆదిత్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో వీరన్నపేట్, ఎర్రమన్నుగుట్ట, మక్కామజీద్, శివాలయం, యాదవకమ్యునిటీ హాల్, హెచ్ఎస్ ఫంక్షన్ హాల్‌ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 దాక విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సర్వీస్ రోడ్లే కల్లాలు

- రోడ్లపై ధాన్యం కుప్పలతో వాహనదారులకు తప్పని తిప్పలు
- తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు



రాజాపూర్ సర్వీస్‌రోడ్డుపై దర్శనమిస్తున్న ధాన్యం కుప్పలు

రాజాపూర్: గతంలో రైతులు తమ పంటలు చేతికి వస్తున్నయంటే చాలు ముందుగానే తమ పొలంలో ఓ పక్క పంటలను నూర్పిళ్లు చేసి ఆరబెట్టుకునేందుకు కల్లాలను తయారు చేసుకునేవారు. ప్రస్తుతం వ్యవసాయం చేసేవారు ఉన్నా అంతా కొత్తటెక్నాలజీ వాడుతూ కరిగెట చేసే దగ్గర నుంచి వరి మడిని కోసి నూర్పిడి చేసే వరకు అన్ని యంత్రాలనే వాడుతున్నారు. దీంతో రైతులు తమ పొలాల్లో కల్లాలు లేకపోవడంతో జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్‌రోడ్లనే కల్లాలుగా వాడుకుంటున్నారు. తాము పండించిన ధాన్యాన్ని ఈ రోడ్లపైనే ఆరబెడుతున్నారు. దీంతో పంటల సీజన్‌లో వాహనదారులు ఇబ్బందులు పడుతు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, ముదిరెడ్డిపల్లి, రాజాపూర్ మండల కేంద్రంతో పాటు బాలానగర్ మండలంలోని కేతిరెడ్డిపల్లి, పెద్దాయపల్లి, గ్రామాల జాతీయ రహదారులపక్కన ఉన్న సర్వీస్‌రోడ్లు వరిధాన్యం కుప్పలతో దర్శనమిస్తున్నాయి. రాత్రివేళల్లో ధాన్యం కుప్పల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఆరు నెలల క్రితం రాజాపూర్ మండల కేంద్రంలోని సర్వీస్‌రోడ్డులో శంకరమ్మ అనే మహిళ ధాన్యం ఆరబోస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఈ నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్లపై ధాన్యం కుప్పలు ఆరబోయకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన భాధ్యత సంబంధిత అధికారులపై ఎంతైన ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రైతులకు చెబుతూనే ఉన్నాం



రాజాపూర్ మండల కేంద్రంలోని సర్వీస్‌రోడ్లపై ధాన్యం ఆరబోయకూడదని ఎన్నో పర్యాయాలు రైతులకు తెలియజేశాం. సర్వీస్‌రోడ్లపై శానిటేషన్ వీలైనంత వరకు గ్రామ పంచాయతీ సిబ్బందితో చేయిస్తున్నాం హైవే మేయిన్‌టేనెన్స్ వారు రెండు మూడు నెలలకు ఒకసారి చేస్తున్నారు. రైతులకు కూడా ధాన్యం కుప్పలు తీయాలని తెలియజేస్తున్నాం.

– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజాపూర్

ప్రమాదాలు జరుగుతున్నాయి



సర్వీస్‌రోడ్లపై ధాన్యం కుప్పలు ఉండటంతో ప్రతి రోజు ఇబ్బందులు ఉడుతున్నాం. అసలే ఎక్స్‌ప్రెస్ హైవే కావడంతో ద్విచక్ర వాహనాలపై వచ్చే మాలాంటి వారు ప్రమాదాలకు గురవుతున్నారు. రైతులను వారి పొలాలవద్ద కల్లాలు ఏర్పాటు చేసుకుని అక్కడే ధాన్యం ఆరబోసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలి.

– నవీన్‌కుమార్‌గౌడ్, రాయపల్లి

అవగాహన కల్పించాలి



సర్వీస్‌రోడ్లపై ధాన్యం కుప్పలు పెట్టడంతో వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. వర్షాకాలంలో అయితే మరీ దారుణంగా ఉంటుంది ఎక్కడ చూసినా సర్వీస్‌రోడ్లపై ధాన్యం కుప్పలే దర్శనమిస్తున్నాయి. హైవే అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ధాన్యం రోడ్లపై ఆరబోయకుండా అవగాహన కల్పించాలి.

– వెంకటేశ్వర్, రాజాపూర్

ధాన్యం తరలించండి మహాప్రభో!



కాకర్లపహడ్‌లో మూడు రోజులుగా కవర్ల కిందనే ధాన్యం బస్తాలు

నవాబుపేట: గిట్టు బాటు ధర కోసం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం వేస్తే వాటిని రోజుల తరబడి ఆలస్యం చేస్తూ ఇబ్బందులు పెడుతున్నరాని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని కాకర్లపహడ్, కొల్లూర్, చౌడూర్ కేంద్రాల వద్ద ధాన్యం కొద్ది రోజులుగా నిల్వ ఉందని తరలించడం లేదని అంటున్నారు. కాకర్లపహడ్‌లో రైతు వెంకట్‌రెడ్డికి చెందిన దాదాపుగా 150 బస్తాల ధాన్యం తూకం చేసి మూడు రోజులుగా అలాగే కవర్లు కప్పి ఉంచారు. తీరా మిల్లర్లకు ఆలస్యంగా పంపిస్తే వారు కోతలు విధిస్తున్నారని వాపోయాడు. ఇలా ప్రతి కేంద్రంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. కాగా మండలంలోని లింగంపల్లి, కారుకొండ, కొండాపూర్ కేంద్రాల్లో మాత్రమే తూకం చేసిన వెంటనే ధాన్యం తరలిస్తున్నారని మిగతా చోట్ల పరిస్థితి దయనీయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే కొల్లూర్ రైతులు మిల్లర్లు మూడు నుంచి నాలుగు కేజీల తరుగు తీస్తున్నారని మండల అధికారులకు ఫిర్యాదు చేశారు.

రైతులు ఆందోళన చెందవద్దు



రైతులతో మాట్లాడుతున్న మల్లేష్‌గౌడ్

రాజాపూర్: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని బాలానగర్, రాజాపూర్ ఉమ్మడి మండలాల ఏఎంసీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో 15 రోజులుగా ఆరబోసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎవరూ రావడం లేదని రైతులు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. లారీలు రావడంలేదని, ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరుగుతోందని రైతులు ఆయకు వివరించారు. దీంతో వెంటనే రెండు లారీలను అక్కడికి తెప్పించారు. ధాన్యాన్ని బస్తాలలో తూకం చేయించి పంపించారు. పీఏసీఎస్ సిబ్బంది శేఖర్, రైతులు లింగం, ఎర్రన్న, డిష్‌మల్లేష్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లు



రాయితీ బస్‌పాస్‌లు పొందిన దివ్యాంగులు

జడ్చర్ల టౌన్: దివ్యాంగులకు ఆర్టీసీ అందిస్తున్న 50శాతం రాయితీ బస్‌పాస్‌లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు చెన్నకేశవులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు కావలి నర్సింహులు, దివ్యాంగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, పద్మనాయక్, బిచ్యానాయక్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

కోయిల్‌కొండ: స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ లిస్టులో కొత్తపేర్లను నమోదు చేయించాలని తహసీల్దార్ ప్రేమ్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బూత్‌లెవల్ ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో కొత్త ఓటర్ల నమోదును, మరణాల తొలగింపులు, అడ్రస్‌లు సరిచేయడం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వీఆర్‌ఏలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాల ఆడిట్



గండేడ్‌లో కొనసాగుతున్న ఆడిట్

గండేడ్: గ్రామ సంఘాల ఆడిట్ ప్రారంభం అయ్యింది. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఆయా గ్రామాల గ్రామ సంఘాలకు సంబంధించి ఆడిట్‌ను డీఎంజీ రాములు ఆధ్వర్యంలో శుక్రవారం కొనసాగించారు. గ్రామ సంఘాలకు ఇచ్చే సీఐఎఫ్, శ్రీనిధితో పాటు అంతర్గత అప్పులు, ఖర్చులు, ఆదాయాల వంటి వాటిపై ఆడిట్ నిర్వహించారు. శుక్రవారం 15 గ్రామసంఘాల ఆడిట్‌ను పూర్తి చేశారు. ఆడిటర్లు షణ్ముగం, రాజు, ఏపీఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న అభిమన్యురెడ్డి

రాజాపూర్: బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరుగుతోందని దోండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యురెడ్డి అన్నారు. కుత్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బోడగుట్టతండాలో అండర్ డ్రెయినేజీ పనులు ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ సేవ్యానాయక్ నాయకులు వెంకట్, ప్రవీణ్, దోలిబాయి, సంతోష్, శ్రీనివాస్, సురేష్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రికవరీ చేయండి



మహిళా సమాఖ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

మహమ్మదాబాద్: డ్వాక్రా సంఘాల ద్వారా గ్రామీణ చిరు వ్యాపారులకు, వ్యవసాయదారులైన మహిళలకు ఇచ్చిన రుణాలను వాయిదా పద్ధతిలో సకాలంలో తిరిగి చెల్లించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఫైనాన్స్ అధికారి దామోదర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయాన్ని ఆయన సిబ్బందితో సందర్శిచారు. ఈ సందర్భంగా డ్వాక్రా సిబ్బందితో సమావేశమయ్యారు. గతంలో మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలను చెల్లించడంలో కొందరు ఆలస్యం చేస్తున్నారని అన్నారు. అందుకు బ్యాంకుల్లో తిరిగి రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అలాకాకుండా ఉండాలంటే ప్రతి సభ్యురాలు తీసుకున్న రుణాలను చెల్లించేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. మహమ్మదాబాద్ గ్రామంలో కొన్ని సంఘాలు అకారణంగా రుణాలు చెల్లించనందున ఎస్‌బీఐ సూచనల మేరకు తీసుకున్న రూ. 43 లక్షల రుణాల్లో ఇప్పటివరకు రూ.20లక్షలకు పైగా మహిళల నుంచి వసూలు చేసినట్టు సమాఖ్య అధికారులు తెలిపారు. కాగా ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు రూ.8లక్షలకు పైగా రుణాలు వసూలు చేసినట్లు ఏపీఎం సునీత, సీసీలు తెలిపారు. కరోనా నేపథ్యంలో మహిళలు ఆర్థికంగా వెనుకబడినందున విడతల వారీగా రుణాలు చెల్లించేందుకు తగిన నిర్ణయం తీసుకున్నట్లు వారు అధికారులకు వివరించారు. రుణాలు పూర్తిగా చెల్లించిన సంఘాలకు కొత్తగా రుణాలను ఇచ్చేందుకు సంబంధిత బ్యాంకు మేనేజరు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. రుణాల లావాదేవీల విషయంలో ప్రతీ సంవత్సరం ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎం తెలిపారు. డీపీఎం సలోమీ, మార్కెటింగ్ డీపీఎం చెన్నయ్య పాల్గొన్నారు.